నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : వేసవి సమీపించిన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, గ్రామీణ మంచినీటి సరఫరా, పంచాయతీ రాజ్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో వందశాతం పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవోలు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లకు సహకరించాలన్నారు. జిల్లాలో పన్నులు బకాయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో అదనపు అంతస్తుల కళాశాల భవనాలు, పరిశ్రమల నిర్మాణం కోసం దరఖాస్తులను పరిశీలించి వెంటనే పన్నులను వసూలు చేసి అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. పార్కులలో పచ్చదం పెంపొందించాలన్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రతాప్, జిల్లా ఉన్నతాధికారులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

వ్యాపార రంగంలోనూ రాణించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : విద్యార్థినీలు చదువులతో పాటు వ్యాపార రంగంలోనూ రాణించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విపణి కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వ్యాపార రంగంలోనూ అభివృద్ధిని సాధించాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థినీ తమ సొంత కాళ్లపై నిలబడినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు కళాశాల ఆవరణలో విద్యార్థినీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. అనంతరం కళాశాల ఆవరణలో కలియ దిరుగుతూ కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాజీ మంత్రికి మల్లన్న జాతర ఆహ్వానం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 19 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో 23న నిర్వహించే మల్లన్న స్వామి జాతరకు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును గ్రామ కురుమ సంఘం నేతలు, మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆహ్వానించారు. బుధవారం బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు ఆదర్శ్ రెడ్డితో కలిసి మాజీ కార్పొరేటర్ అంజయ్య, కురుమ సంఘం సభ్యులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అధ్యక్షుడు నర్సింహ, రవి, క్రాంతికిరణ్, ఉదయ్ కిరణ్, భాను, విష్ణు ఉన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ అంజయ్య

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

హత్నూర, ఫిబ్రవరి 19 : వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎల్పీవో అనిత సూచించారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూరలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా నిర్వర్తించాలన్నారు. మొక్కలు ఎండ వేడిమికి మృతిచెందకుండా ఉండడం కోసం ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్ల మాచునూరులో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో అనిత

బాధిత కుటుంబానికి పరామర్శ

జిన్నారం ఫిబ్రవరి 19 : జిన్నారం మాజీ సర్పంచ్ నాగులూరి పోచమ్మ భర్త పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు నాగులూరి బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం పార్టీ నాయకులతో కలిసి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలయ్య మృతిపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా నిలుస్తూ సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తరఫున మృతుడి కుమారుడు మాజీ ఎంపీటీసీ నర్సింహులుకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ నాయకులు భోజిరెడ్డి, నరసింహారెడ్డి, మంద రమేశ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్‌రావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పోచమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహీర్, ఫిబ్రవరి 19 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీడీవో భారతి కోరారు. బుధవారం మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో 66 మంది విద్యార్థులుండటం శుభ పరిణామన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి హెచ్ఎం రవీందర్, డాక్టర్ వసంతరాజు, కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

మేలు జాతి పశువుల పోషణతోనే అధిక లాభాలు

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : మేలు జాతి పశువుల పోషణతోనే అధిక లాభాలను పొందవచ్చని న్యాల్‌కల్ పశువైద్యాధికారి గణేశ్ అన్నారు. బుధవారం జిల్లా పశుగ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా పశువులకు సాధారణ పరీక్షలతో గర్భస్థ పరీక్షలను నిర్వహించి మం దులను పంపిణీ చేశారు. ఎండకాలం లో పశువుల ఆరోగ్యాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం లేగదూడలకు నట్టల నివారణ మందులను వేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని కోళ్ల ఫారాలను సందర్శించి బర్డ్‌ఫ్లూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఫౌల్ట్రీ యాజమానులకు సూచనలు చేశారు. గోపాల మిత్ర సూపర్‌వైజన్ తుక్కారెడ్డి, గోపాల మిత్రలు ధన్‌రాజ్, జనార్దన్‌రెడ్డి, నాగప్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

లేగదూడలకు నట్టల నివారణ మందులను వేస్తున్న పశువైద్యాధికారి గణేశ్

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామ శివారులోని ఎస్ఎస్‌వీ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం రెస్టారెంట్ వెనక భాగంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డితో ఉన్న కన్వెషన్ హాల్, అతిథి గృహాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రెస్టారెంట్, ఇతర వాటికి కాపాడారు. ఈ సంఘటన వల్ల రెస్టారెంట్‌లో భారీగా నష్టం జరిగినట్లు రెస్టారెంట్ నిర్వహకులు పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : మున్సిపల్ కార్మికులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని సీఐటీయూ సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలను మంజూరు చేయాలన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులకు డబ్బులను చెల్లించలేదన్నారు. వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు యశోదమ్మ, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 19 : ఓటు ఆయుధం..ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. సిద్దిపేట ఎన్‌జీవో భవనలో బుధవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగులు ఓటు హక్కు నమోదు చేసుకోవడం లేదన్నారు.ఓటు హక్కునమోదు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు.ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కలిశామని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను త్వరగా ఇప్పించాలని..ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరామన్నారు. ఉద్యోగులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారన్నారు.కార్యక్రమంలో టీఎన్జీవో నేతలు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని న్యాల్‌కల్ తహసీల్దార్ భూపాల్ హెచ్చరించారు. మండలంలోని డప్పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 105 ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుం డా అక్రమంగా మట్టిని తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు బుధవారం రెవెన్యూఅధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ భూపాల్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాం రావు స్థానిక గ్రామానికి వెళ్లి అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వకాలు చేస్తున్న హిటాచీని పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా అక్రమం గా మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా మ ట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డప్పూర్ గ్రామ శివారులో హిటాచీ వాహనాన్ని పట్టుకున్న మండల రెవెన్యూ అధికారులు

ప్రతి ఇంటికీ మంచి నీళ్లు అందిస్తాం..

మునిపల్లి, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో ఆరు నెలల నుంచి దళితవాడలో తాగునీటి సమస్య ఉందని బుధవారం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో వచ్చిన కథనానికి మండల అధికారులు స్పందించి ఖమ్మంపల్లిలో పర్యటించి తాగు నీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖమ్మంపల్లి దళిత వాడతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటికి మంచి నీళ్లు అందస్తామని తెలిపారు.

ఖమ్మంపల్లిలో దళిత వాడలో పర్యటిస్తున్న అధికారులు

ప్రొఫెసర్ ఆత్మహత్య

మునిపల్లి, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సన్ యూనివర్సిటీలో సుమంత్ కుమార్ (36) యూనివర్సిటీలోని తన గదిలో బుధవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సన్ యూనివర్సిటీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుమంత్ కుమార్ 2023లో స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైనర్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరినట్లు ఎస్సై తెలిపారు. ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించాం. సుమంత్ గదిలో పలు రకాల మెడిసెన్స్ ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సదాశివపేట ప్రభు త్వ దవాఖానకు తరలించామని, మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

దేవుని చెరువులో గుర్తు తెలియని మృతదేహం

కంది, ఫిబ్రవరి 19 : మండలకేంద్రమైన కంది దేవుని చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు సంగారెడ్డి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితికి చేరింది. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయస్సు 35-40 ఏండ్లు ఉంటుందని, ఎవరికైనా అనుమానం ఉంటే సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై రవీందర్ కోరారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

చెరువులో గల్లంతైన ఇద్దరు యువకులు మృతి

జిన్నారం, ఫిబ్రవరి 19 : చెరువులో ఈత సరదా ఇద్దరు స్నేహితుల నిండు ప్రాణాలు బలిగొన్న సంఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వావిలాల పీర్ల చెరువులో చోటుచేసుకుంది. జిన్నారం ఎస్సై నాగలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం.. చర్చిగగిలాపూర్‌కు చెందిన వల్లపు నరేశ్ (26), అతడి స్నే హితుడు పల్లపోలు శంకర్ (22) ఈనెల 18న జిన్నారం మండలంలోని వావిలాల గ్రామ సమీపంలో గల పీర్ల చెరువు వద్దకు స్కూటీపై వచ్చారు. ఇద్దరు కలిసి కల్లు తాగిన అనంతరం ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు చెరువులోకి మునిగిపోయారు. అదే సమయంలో వారిని గమనించిన పశువుల కాపరి కాపాడడానికి ప్రయత్నించాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. సమాచారం మేరకు దీంతో గల్లంతయిన ఇద్దరి మృతదేహాల కోసం జంగంపేట, వావిలాలకు చెందిన ఈతగాళ్ల సాయంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహాలు వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

అందోల్, ఫిబ్రవరి 19 : ప్రొహిబిషన్, ఎక్సైజ్ అందోల్ శాఖ ఆధ్వర్యంలో నేడు (గురువారం) ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ సాగర్‌రెడ్డి తెలిపారు. గతంలో వివిధ నేరాల్లో పట్టుపడిన వాహనాలు సీజ్ చేశామని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొన్నాలన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : జహీరాబాద్ పట్టణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ సంఘ సేవకుడు అబ్దుల్ సమీర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఐకాన్ క్యాన్సర్ సెంటర్ సహకారంతో నీలం దవాఖాన ఆధ్వర్యంలో పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో గైనకాలజీ, క్యాన్సర్, ఫిజీషియన్, గుండె, ఫిడీయాట్రిక్, బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎక్కో, అల్ట్రా సౌండ్ స్కాన్, కంటి, థైరాయిడ్ తదితర వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోడల్ ఇండ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణానికి సంబంధిత మండల అధికారులు ముగ్గులు వేశారు. బుధవారం గ్రామంలో ఇందిరాక్రాంతి కార్యాలయం ఎదుట నిర్మించ తలపెట్టిన మోడల్ ఇందిరమ్మ ఇండ్లకు మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్, మండల గృహ నిర్మాణ శాఖాధికారి మాధవరెడ్డి భూమి పూజలు చేసి, పనులను శ్రీకారం చుట్టారు. మండల అధికారులు పాల్గొ న్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన న్యాల్‌కల్ మండలంలోని హుస్సెల్లి గ్రామ శివారులోని జహీరాబాద్-బీదర్ రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని శంషొల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రభు (30) మంగళవారం రాత్రి ఇంటికి కాలినడకన వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జహీరాబాద్ ప్రభుత్వ దవఖానకు తరలించారు. బుధవారం మృతుడి భార్య మున్నెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హద్నూ ర్ పోలీసులు పేర్కొన్నారు.

కేతకీ హుండీ ఆదాయం లెక్కింపు

హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులు

ఝరాసంగం, ఫిబ్రవరి 19 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగరావు పర్యవేక్షణలో స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 76 రోజులకు రూ. 28.07 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప తెలియజేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో కానుకల రూపంలో వేసిన నగదు, నాణేల లెక్కింపు కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. హుండీ లెక్కింపులో కామారెడ్డి పట్టణానికి చెందిన రాజరాజేశ్వరి సేవా సమితి, హైదరాబాద్ శివకేశవ స్వచ్ఛంద సేవా సమితికి చెందిన భక్తులు, అర్చకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ రికార్డు అసిస్టెంట్ రమేశ్, విరన్న, ఆలయ అర్చకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం ఫిబ్రవరి 19 : జిన్నారం మండలంలో కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నారం, సోలక్పల్లి, శివానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయానికి గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఛత్రపతికి నివాళి

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూజలు చేసి అనంతరం గ్రామ పూరవీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 19

సదాశివపేట : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

హత్నూర : సిరిపురలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న యువకులు

ఝరాసంగం : శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

సంగారెడ్డిలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా యువకుల భారీ ర్యాలీ

రాయికోడ్ : సింగితంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

నారాయణఖేడ్‌లో శివాజీ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

పుల్కల్ : చత్రపతి శివాజీ చౌక్ వద్దకు శోభాయాత్రగా వెళ్తున్న యువకులు

గుమ్మడిదల: నల్లవల్లిలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు జేఏసీ నాయకులు

జిన్నారం : కాషాయ జెండాలతో జంగంపేట గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

తెలంగాణ గ్రామీణ బ్యాంక్
ప్రధాన కార్యాలయం: హైదరాబాద్ | ప్రాంతీయ కార్యాలయం: సంగారెడ్డి

వేలం అమ్మకం ప్రకటన (బంగారం)

దిగువ తెలిపిన వ్యక్తులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, వారు తమ రుణ ఖాతాలలో బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి నోటీసులు పంపబడినవి. అందువల్ల, **28-02-2025**న లేదా ఆలోగా బకాయి మొత్తాలు మరియు ఇతర ఛార్జీలు చెల్లించి తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విడిపించుకోవాల్సిందిగా వారు కోరబడుతున్నారు. విఫలమైనచో సదరు సెక్యూరిటీలు **28-02-2025న సా॥ 4.00 గం.కు** లేదా తరువాత ఏదేని ఇతర అనుకూలమైన తేదీన బ్యాంక్ పూర్తి విచక్షణ మేరకు తదుపరి నోటీసు లేకుండా **సంబంధిత శాఖల** వద్ద బ్యాంక్ ఆవరణ వద్ద రుణగ్రహీత ఖర్చుతో బహిరంగ వేలంలో బ్యాంక్ ద్వారా విక్రయించబడతాయి.

క్ర.సం.	బంగారం రుణ ఖాతా నెం.	రుణగ్రహీత పేరు & చిరునామా	బంగారం (గ్రాములలో)	శాఖ పేరు
1	73220367614	మొహమ్మద్ అక్బర్, తండ్రి: అబ్దుల్ హమీద్, ఇం.నెం. 8-3-169/636, HF నగర్, బోరబండ, బాలానగర్, KV రంగారెడ్డి, పిన్-500 018.	25.75	బిలాల్‌పూర్ మొబైల్ నెం.9490157399
2	73215650726	ఎల్లంగారి కృష్ణ, తండ్రి: శివయ్య, ఇం.నెం. 4-85-1, పెద్దమ్మగూడెం, జిన్నారం.	29.88	జిన్నారం మొబైల్ నెం.9490157368
3	73214830404	కె.లావణ్య, భర్త: వెంకటేశం, మంచన్‌పల్లి (గ్రా), రంగారెడ్డి.	35.37	బుధేరా మొబైల్ నెం.9490157378
4	73223108942	ఎలిమెల ప్రమోద్, తండ్రి: సమయ్య, ఇం.నెం. 1-15, కొల్లూర్, RC పురం, సంగారెడ్డి, పిన్-502 300.	230.4	BHEL మొబైల్ నెం. 9490153750
5	73223110496	ఎలిమెల ప్రమోద్, తండ్రి: సమయ్య, ఇం.నెం. 1-15, కొల్లూర్, RC పురం, సంగారెడ్డి, పిన్-502 300.	255.6	BHEL మొబైల్ నెం. 9490153750
6	73223112314	ఎలిమెల ప్రమోద్, తండ్రి: సమయ్య, ఇం.నెం. 1-15, కొల్లూర్, RC పురం, సంగారెడ్డి, పిన్-502 300.	59.36	BHEL మొబైల్ నెం. 9490153750
7	73214048507	పి.మల్లేశం, తండ్రి: చంద్రయ్య, ఇం.నెం. 4-2/1, కాశీపూర్ (గ్రా), మెదక్, పిన్-502 285.	31.5	ఇంద్రకన్ను మొబైల్ నెం. 9440903966

తేది: 19-02-2025 | సం/- రీజినల్ మేనేజర్, TGB, సంగారెడ్డి రీజియన్.